# 13. జారిపోతున్న బాల్యం

దీనికంతటికీ మూలకారణం మా సుందరమ్మక్కయ్య.

రాజాంకీ, బల్జిపేటకీ మధ్యన ఒక అగ్రహారం వాళ్లుండేది.

మా అక్క పెళ్లినాటికి బాల్యవివాహాలు పోయాయి కాని, 20 దాటితేగాని పెళ్లి సంబంధాలు చూడక్కరలేదు అనుకునేకాలం కాదు. మంచి కుటుంబం, 50 ఎకరాల పొలం, అర ఎకరం స్థలంలో కట్టుకున్న ఆరు గదుల ఇల్లు. పైన పెద్ద డాబా, ఇంటి చుట్టూరా కూరా పండూ ఇచ్చే మొక్కలు. ఒక ఆవు, రెండు గేదెలు - ఇవన్నీ చూసి భోజనానికి, అధికారానికి, గౌరవానికి లోటు లేదు కదా అని ఆ పెళ్లి చేశారు మా పెద్దలు.

చిత్రమేమిటంటే నా పెళ్లి మా అక్క పెళ్లి తరువాత ఏడేళ్లకు జరిగినా సరే - ఆవిడ పిల్లలు ముగ్గురు. మా పిల్లలు ఇద్దరు ఒకే వయసువాళ్లుగా ఉన్నారు. ఆ పిల్లలు చిన్న చిన్న క్లాసులన్నీ అగ్రహారంలోనే చదువుకున్నారు. ఆరవ తరగతి నుంచి పై చదువుల కోసం బల్జిపేట పంపుతారా, లేకపోతే బొబ్బిలిలో ఉన్న మేనత్త ఇంటికి పంపుతారా - అనేది ఇంకా తేలలేదు.

ఇలాంటి సమయంలో చైత్రశుద్ధ ఏకాదశినాడు మా నాన్నగారి ఆబ్దికం సందర్భంగా మా అక్కా బావా వచ్చారు. పోతూ పోతూ, మా సూరిబాబునీ, జ్యోతినీ 'తాటిముంజెలూ, జున్నూ' అంటూ మా అక్కా బావా లొంగ తీసుకుని తమతో వాళ్లూరికి లాక్కుపోయారు.

❖ ❖ ❖

మా అక్క మామగారూ, అత్తగారూ అచ్చమైన అగ్రహారపు వ్యక్తులు. పైగా ఉమ్మడి కుటుంబం. వాళ్ల అభిలాషల ప్రకారం రోజులు గడపడం పిల్లలకి ఒక కష్టం కాగా, వారానికి రెండు సినిమాలు చూడకుండా ఉండడం ఇంకొక ఇబ్బంది. ఎలా గడుపుతున్నారో అని నేనూ, రవణమ్మా దిగులుపడ్డాము.

కానీ, పిల్లలు మళ్లీ ఇల్లు చేరాక వాళ్ల మొహాల్లో క్రొత్త కళలూ, నున్నదనాలూ వచ్చినట్లు నాకూ, రవణమ్మకీ కొంచెం కొంచెం అనుమానం వేసింది. ఇరుగుపొరుగువాళ్ల మాటల సందర్భంలో చెప్పేసరికి మా అనుమానం నమ్మకమయింది.

"ఒరేయ్, అగ్రహారంలో టైమ్‌పాస్‌కి మీరేం చేశార్రా?" అని అడిగింది రవణమ్మ - వాళ్లు ఇంటికి చేరిన రెండు రోజులనాడు.

మా అమ్మాయి చెప్పిన ఆటల జాబితా వింటేనే నాకు ఒళ్లంతా పులకరం. ఇంక ఆ ఆటలలో ఉపయోగించే వస్తువులేమిటి, పద్ధతులేమిటి, రూల్సు ఏంటి - అవన్నీ చేర్చి ఒక పుస్తకం వ్రాయవచ్చునని తోచింది. ఎప్పుడో మా చిన్నతనంలో మా అక్కా చెల్లెళ్ళ,

ఇరుగు పొరుగు ఆడపిల్లలు ఆడిన ఆటలు - అవన్నీను. మనం ఆటకమీద పెట్టేశామే పెద్ద గళ్లు, అంకెలు ఉండే బొమ్మ - దాని పేరు 'పరమ పదసోపాన పటము'. దాన్నిండా పాములు, నిచ్చెనలు. దానిని వైకుంఠపాళీ అంటారుట.

పులీమేకా ఆట అని ఒకటుంది. మూడు పులులు, 16 మేకలని తినేయడానికి ప్రయత్నిస్తుంటాయి.

మేకలు ఎప్పటికప్పుడు పులులు చేసే దండయాత్రలకి లొంగకుండా తప్పించుకుంటాయి. మేకలు ఆ దండయాత్రలని తప్పించుకుంటూనే పులులను బందీలుగా చేసి కట్టేస్తాయి. చాలా ఉత్సాహంగా సాగుతుంది ఈ ఆట. ఇందులో ఆడేవాళ్ల తెలివితేటలూ, చురుకుదనాలూ బయటపడతాయి.

"సరేలేవే! చింతపిక్కల ఆటలు ఏమీ నేర్పలేదా?" అని అడిగింది రవణమ్మ.

"అబ్బో! ఎన్ని రకాలో! ఒక చింతపిక్కల పోగు ఉంటుంది. వీలయినంతవరకు ఒక దానికొకటి తగలకుండా పరచిపెడతారు. ఒక పిక్క చేతిలోకి తీసుకుని దాన్ని కొంచెంపైకి ఎగరేసి క్రిందనున్న చింతపిక్క ఒకదానిని ఏరాలి. పైకి ఎగరేసిన పిక్క నేలమీద పడకుండా అరచేత్తో ఆపి పిడికిటిలో మూయాలి. పిడికిటిలో ఉన్న రెండింటిలో ఒకదాన్ని పైకి ఎగరేసి మూడవ పిక్కని ఏరాలి.

ఇలా 4 కాగానే ఒక దగ్గర పోగు పెట్టాలి. మళ్లీ పుంజీలు, పుంజీలు చొప్పున పోగుచేసుకుని దాచుకోవాలి. అలాంటివి 10 అయితే ఒక గుర్రం. పది గుర్రాలు ఒక ఏనుగు. ఇలా ఎవరు ఎక్కువ సంపాదించగలిగితే వాళ్లది గెలుపు. ఇదీకాక 'వామనగుంటలాట' అని ఒకటుంది. చింతపిక్కల్ని కోతుల్లా అనుకుని 'కోతాట'లాడుకోవడం ఉంది. చింతపిక్కల్ని పైకి ఎగరేసి అరచేతి మీద కాక మండమీద పట్టుకోడం ఇలాంటివి ఎన్నో రకాలున్నాయి. అన్నీ నవ్వులాటలే, అన్నీ పోటీలే!

'అష్టాచెమ్మా' అని ఒకటుంది. ఇది ఇద్దరు ఆడొచ్చు. ముగ్గురూ ఆడొచ్చు. నలుగురు కూడా ఆడొచ్చు. దీనికి నేలమీద ఐదేసి గళ్లు చొప్పున ఐదు లైనులు పెడతారు. ప్రతీ ఐదింటిలో మధ్య గడిని పంటగడి అంటారు. పంటగడి చుట్టూ నాలుగు 'ఇంటూ' మార్కు గడులుంటాయి. ఒక ఆటలో ఉన్నవాళ్లు తన పావుని ఇరవై ఐదు గడులకి నడిపించి పంట పండించుకోవాలి. ఈ నడక అపసవ్య దిక్కుగా సాగుతుంది. మధ్యలో ఇంటూ మార్కుల్లేని గడులు ఉంటాయి కదా - అక్కడ మన పావు ఉండగా ఇంకొకరిది అక్కడికి చేరుకుంటే మన పావు చచ్చిపోతుంది. ఆటగాళ్లలో ఒక్కొక్కరికి ఐదు పావులుంటాయి. ఐదు పావులని చావు వాత పడకుండా చూసుకుంటూ ఎవరు ముందుగా పంట పండిస్తారో వారిదే గెలుపు.

నా భార్య రవణమ్మ అడ్డు తగలకపోతే జ్యోతి అలా చెప్పుకుంటూ పోయేదే.

"అవును జ్యోతీ, మా చిన్నప్పుడు మేము కూడా ఆడుకున్నాం. పచ్చీస్‌పాళీ

మొదలెట్టామంటే శివరాత్రి ఇట్టే తెల్లారిపోయేది. అందులోనూ నాలుగు కొమ్మలకి నలుగురూ దొరికారంటే పందెపు గవ్వలు ఏడింటినీ అరచేతుల మధ్యనో, దోసిట్లోనో గలగలలాడించి ఒక్కొక్క పందెం ఎంతలేసొచ్చిందో చూసుకుంటూ చచ్చిపోయిన పావుల్ని మళ్లీ పుట్టించుకుంటూ వేరేవాళ్ల పావుల్ని చంపడానికి ప్రయత్నిస్తూ సాగుతుంది ఆట. పందెపు గవ్వలు ఏడింటినీ గలగలలాడించి విసిరేటప్పుడు ఎన్ని కళ్లు పడతాయో ఆత్రంగా ఎదురుచూడడం పెద్ద సరదా. ఒకటి పడితే దస్ అంటే పది గడులు. 2, 3, 4 - ఎన్ని పడితే అన్ని గళ్లే. అయిదు పడితే పచ్చీస్ అంటే 25 గడులు. ఆరు పడితే తీసు అంటే 30. ఏడు పడితే బారహ్ అంటే 12. ఏడూ బోర్లా పడిపోతే చెక్కా అంటే 14. ఇలా 8 పావులు, 105 గళ్లు ప్రయాణాలు చేసుకుంటూ చివరికి స్వర్గపు గడి చేరుకుంటూ ఉండాలి. మధ్యలో చావులు, బ్రతుకులు. అబ్బో, ఎంత చక్కటి ఆట."

నేను అన్నాను - "ఈ ఆటలో చావులు, బ్రతుకులు, ముందుకు వెళ్లడాలు - చివరికి స్వర్గపు గడి చేరడాలు - వీటన్నిటిలో మంచి సంక్లిష్టమైన జీవన వేదాంతం ఉంది."

"నేనూ కొన్ని చూశానమ్మా. 'దాగుడుమూతా దండాకోర్ - పిల్లీ వచ్చే ఎలకా చోర్' అని ఒక ఆట ఉంది. 'వీరీ వీరీ గుమ్మడిపండు. వీరి పేరేమి' అని పాడుకుంటూ ఆడే ఆట ఉంది. వీటిలో చాకిరేవు బల్ల అనేది ఇప్పుడు మ్యూజికల్ ఛైర్స్ అనే పేర ఆడుకుంటున్నాం" అన్నాడు సూరిబాబు.

"ఏడిశావులే గాని, మగపిల్లలాట లేమీ నేర్చుకోలేదా?"

"అయి బాబోయ్. ఎందుకు నేర్చుకోలేదు. మన బిళ్లాకర్రాట. అయిదారు శతాబ్దాల నుంచి ఉందిట. మరి, క్రికెట్ వయసు రెండు శతాబ్దాలే కదా! ఖచ్చితంగా మన బిళ్లా కర్ర ఆట చూసే క్రికెట్ ఆట రూపొందించారని నాకు అనిపిస్తుంది. బిళ్లాకర్రాలాటలో రెండు పార్టీలుంటాయి. ఆడే వేళకి ఎనిమిది మంది చేరితే నలుగురేసి చొప్పున, పదిమంది చేరితే ఐదేసి మంది చొప్పున అప్పటికప్పుడు రెండు పార్టీలుగా చీలిపోతారు. రెండు పార్టీలకీ చెందని ఒకడ్ని ఆట పెద్దగా పెట్టుకుంటారు.

ఇప్పటి భాషలో చెప్పాలంటే అంపైర్. బొమ్మా బొరుసూ వేసి ఎవడు ఆడాలో, ఎవడు కాయాలో నిర్ణయిస్తారు. ఇది మనం టాస్ వేసి బ్యాటింగా, ఫీల్డింగా నిర్ణయించడం లాంటిది. ఆడేవాడు ఒక కర్ర పట్టుకుని గిరి దగ్గర నుంచుంటాడు. విసిరేవాడి బిళ్లని గిరిలో పడిపోకుండా కర్రతో గాల్లో ఉండగానే కొట్టాలి. అలా కొట్టిన బిళ్లని గాల్లోనే కాసేవాళ్లలో ఎవడైనా పట్టేసుకుంటే ఆడేవాడు ఔటయిపోతాడు. కాచ్‌కి దొరకకుండా బిళ్ల ఎక్కడికో వెళ్లిపోయి ఆగిపోతే ఎంత దూరం వెళ్లిందో దాన్ని కర్రపెట్టి కొలిచి అన్ని 'లాల్స్'గా లెక్కవేస్తారు. అంటే క్రికెట్‌లో రన్స్‌లాగా, ఒక టీమ్ చేసిన లాల్స్‌ని, రెండో టీమ్ చేసిన లాల్స్‌ని సరిజూసి ఆట పెద్ద గెలుపెవరిదో నిర్ణయిస్తాడు. దీనికీ, క్రికెట్ ఆటకీ చాలా పోలికలున్నాయి. ఇదికాక, చెడుగుడు, కోతి కొమ్మచ్చి, గోళీలాట....."

"అయితే పల్లెటూరి ఆటలన్నీ మీకు నచ్చినట్లున్నాయే! ఇక్కడుంటే రోజుకి ఆరుగంటల సేపు టీ.వి. చూడడం, వారానికి రెండు సినిమాలు చూడడం......" అన్నాను మా వాడి వీపు మీద మెత్తగా తడ్తూ.

"నాట్ ఎటాల్ నాన్నారూ. మేము ఈ రెండు నెలలూ చాలా ఎంజాయ్ చేశాం. అత్తా, మావయ్యా మమ్మల్ని ఆ ఊరు తీసుకెళ్తున్నప్పుడు బోర్ కొడుతుందేమోనని భయపడ్డాం కాని అక్కడ ఎంతో బాగుంది. ఆడుకోడానికి ఖాళీ జాగాలున్నాయి. షికార్లు కొట్టడానికి మావిడి తోటలున్నాయి. దాహం వేస్తే త్రాగడానికి అప్పటికప్పుడు దింపే కొబ్బరి బొండాలున్నాయి. మంచి మంచి ఇండోర్ గేమ్స్ ఉన్నాయి.

అసలు పల్లెటూరి ఆడపిల్లల్లో ఉన్న ధైర్యం, నమ్మకం, చక్కదనం ఎంత బాగున్నాయో చెప్పలేను. పరికిణీలు కట్టుకుని కబ్బాలు తొడుక్కుని ఇప్పుడు జ్యోతి చెప్పిన ఆటలాడుకుంటుంటే వాళ్లలో నేనూ కూచుంటే ఎంత బావుంటుందో అనిపించేసింది. ముఖ్యంగాను బయట ఆటలు ఆడేటప్పుడు పరికిణీలు నడుముల మీదికి మడత పెట్టుకుని వెనుక వైపు దోపుకుని గెంతుతుంటే బలే సీన్ నాన్నారూ. మనం టీ.వీలో ఒక సీరియల్ ఒక ఎపిసోడ్ చూసేలోపల వాళ్లు ఒక డజన్ ముగ్గులు పెట్టేస్తారు. నలుగురూ కలిసి కోరస్‌లలాగా ఎన్నో పాటలు పాడతారు. నాకూ రెండో మూడో పట్టుబడ్డాయి.

'ఒప్పుల కుప్ప వయ్యారి భామ
సన్నబియ్యం చాయ పప్పు
సన్నగాజు, చిన్నముప్వ
గూట్లో రూపాయి నీ మొగుడు సిపాయి
రోట్లో తవుడు నీ మొగుడెవడు?'

అని చప్పట్లు కొట్టుకుంటూ పాడతారు. ఇంకోటేమో -

'ఒక్కా ఓ చెలియా, రెండూ రోకళ్లు, మూడూ ముచ్చెలుకా, నాలుగు నందన్నా, అయిదూ చిట్టి గొలుసూ, ఆరుం దారాలూ, ఏడుం బేడీలూ, ఎనిమిది మనమందా, తొమ్మిది తోకుచ్చు, పది పట్టెడ.'

నాన్నారూ, మీరేమన్నా అనుకోండి గానీ మేము ఈ పట్నానికి చేరిపోయి ఆ పల్లెటూరి అందాలకి దూరమయిపోయాము. కొన్నాళ్లకి నాకే ఇవన్నీ జ్ఞాపకం ఉండవు. పదకొండవ ఏటికే కంప్యూటర్ గేమ్స్ ఆడేస్తున్నానని పడ్డ గర్వం అంతా అక్కడ విరిగిపోయింది."

'అవును సుమా!' అన్నట్టు - నేను, రవణమ్మ మొహాలు చూసుకున్నాము.

*('ఆంధ్రప్రదేశ్' మాసపత్రిక, ఫిబ్రవరి 2009)*